# బీఆర్ఎస్ జైత్రయాత్ర

**అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీదే గెలుపు**

- ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ పక్కా
- 67 సీట్లతో బీఆర్ఎస్ విజయదుందుభి
- ఈఎన్‌టీవీ ఒపీనియన్ పోల్‌లో వెల్లడి
- ప్రముఖ జర్నలిస్ట్ సర్వేలోనూ 67 సీట్లు

హైదరాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారత రాష్ట్రసమితి (బీఆర్ఎస్) తిరుగులేని విజయం సాధిస్తుందని సర్వేలన్నీ స్పష్టం చేస్తున్నాయి. మళ్లీ అధికారం బీఆర్ఎస్‌దేనని, కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని వెల్లడిస్తున్నాయి. ఓటర్లు ఇప్పటికే ఈ దిశగా డిసైడ్ అయ్యారని, ప్రజాభిప్రాయం ఇదే తీరులో ఉందని ఇప్పటికే ఇండియా టీవీ, మిషన్ చాణక్య, ఎన్‌పీఐ సర్వేలు తేల్చిచెప్పాయి. తాజాగా, మరో రెండు సర్వేలు సైతం అధికార బీఆర్ఎస్ ఘన విజయాన్ని నమోదు చేయబోతున్నట్టు ప్రకటించాయి. ఈఎన్ టీవీ సర్వేలో బీఆర్ఎస్ 67 సీట్లతో అధికారాన్ని కైవసం చేసుకుంటుందని తేలింది. విపక్ష కాంగ్రెస్ పార్టీ 39 సీట్లతోనే సరిపెట్టుకోనున్నది. బీజేపీ 6 సీట్లకు పరిమితంకానుండగా, ఎంఐఎం 7 సీట్లను నిలుపుకోనున్నది. అక్టోబర్ 20 వరకు ప్రజాభిప్రాయాన్ని సేకరించిన ఈఎన్ టీవీ ఆయా సర్వే ఫలితాలను ఆదివారం విడుదల చేసింది. జిల్లాలవారీగా తీసుకుంటే అన్ని జిల్లాల్లోను బీఆర్ఎస్ సింహభాగం సీట్లను కైవసం చేసుకొంటుందని ఈ సర్వేలో తేలింది. రంగారెడ్డి జిల్లాలో 14 సెగ్మెంట్లకు 11 సీట్లు, మెదక్‌లో 7, వరంగల్‌లో 8 చొప్పున సీట్లను కైవసం చేసుకొని పట్టు నిలుపుకోనున్నదని వెల్లడైంది. ప్రముఖ జర్నలిస్ట్ దినేశ్‌కుమార్ ఒపీనియన్ పోల్ లోనూ బీఆర్ఎస్ 67 -74 సీట్లు దక్కించుకోనున్నదని తేలింది.

- ఉమ్మడి జిల్లాలవారీగా తీసుకుంటే ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 10 స్థానాలకు బీఆర్ఎస్ 7, కాంగ్రెస్ 3 సీట్లు గెలిచే అవకాశాలున్నాయి.
- నిజామాబాద్ జిల్లాలో 9 స్థానాలకు బీఆర్ఎస్ 6, కాంగ్రెస్ 3, కరీంనగర్ జిల్లాలో మొత్తం 13 స్థానాలకు బీఆర్ఎస్ 8, కాంగ్రెస్ 4, బీజేపీ ఒక సీటు చొప్పున గెలుస్తుందని అంచనా వేసింది.
- మెదక్ జిల్లాలో 10 స్థానాలకు బీఆర్ఎస్ 7, బీజేపీ 1, కాంగ్రెస్ 2 స్థానాలు, రంగారెడ్డిలో 14 స్థానాలకు బీఆర్ఎస్ 11, కాంగ్రెస్ 3 సీట్లు పొందే అవకాశముంది.
- హైదరాబాద్‌లో 15 స్థానాల్లో బీఆర్ఎస్ 4, కాంగ్రెస్ 2, బీజేపీ 2, ఎంఐఎం 7 స్థానాల్లో ముందంజలో ఉన్నాయి.
- మహబూబ్‌నగర్ జిల్లాలో 14 స్థానాలకు బీఆర్ఎస్ 8, కాంగ్రెస్ 5, బీజేపీ 1 చొప్పున గెలిచే అవకాశాలు ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో 12 స్థానాలకు బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు చెరి 6 చొప్పున మొగ్గ కనిపిస్తున్నది.
- వరంగల్ జిల్లాలో 12 స్థానాలకు బీఆర్ఎస్ 8, కాంగ్రెస్ 4, ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ 8, బీఆర్ఎస్ 2 స్థానాల్లో బలంగా ఉన్నాయి.

### పార్టీలవారీగా ఓట్లశాతం (దినేశ్‌కుమార్ సర్వే)

| | |
|---|---|
| బీఆర్ఎస్ | 43.20% |
| కాంగ్రెస్ | 32.70% |
| బీజేపీ | 11.50% |
| ఇతరులు | 12.06% |



### జర్నలిస్ట్ సర్వేలో బీఆర్ఎస్ దూకుడు

ప్రముఖ జర్నలిస్ట్ దినేశ్‌కుమార్ నిర్వహించిన ఒపీనియన్ పోల్ సర్వే లోనూ బీఆర్ఎస్ దూకుడు ప్రదర్శించింది. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే కొలువుదీరనున్నదని వెల్లడైంది. దినేశ్‌కుమార్ వెల్లడించిన సర్వే వివరాల ప్రకారం రాష్ట్రంలో బీఆర్ఎస్ 67 -74 సీట్లు కైవసం చేసుకోనున్నది. ఇక కాంగ్రెస్ 31 -36 సీట్లకే పరిమితం కానున్నది. బీజేపీ 7 -9 సీట్లు, ఇతరులు 6 -8 సీట్లు కైవసం చేసుకోనున్నట్టు తేలింది.

### తన ప్రాణం పోతున్నా.. 48 మంది ప్రాణాలు కాపాడి!

భువనేశ్వర్, అక్టోబర్ 29: ఒక బస్సు డ్రైవర్ తన ప్రాణం పోతున్నా.. 48 మంది ప్రయాణికుల ప్రాణాలు కాపాడాడు. బస్సు నడుపుతున్న సమయంలో డ్రైవర్‌కు గుండెపోటు వచ్చింది. దీంతో వెంటనే ఆయన బస్సును రోడ్డు పక్కన ఉన్న ఓ గోడకు ఢీకొట్టాడు. దీంతో 48 మంది ప్రాణాలు కాపాడి తాను మరణించాడు. ఈ ఘటన ఒడిశాలోని కంధమాల్ జిల్లాలో చోటుచేసుకున్నది. బస్సు భువనేశ్వర్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో డ్రైవర్‌కు గుండెపోటు రావడం.. క్షణాల్లో బస్సును అతడు గోడకు ఢీకొట్టడం వెంటవెంటనే జరిగిపోయాయి. డ్రైవర్‌ను దవాఖానకు తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు మరణించినట్టు ధ్రువీకరించారు. తమ ప్రాణాలు కాపాడి డ్రైవర్ మరణించడంతో ప్రయాణికులు కంటతడిపెట్టారు.

### మహారాష్ట్రలో 160 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

ముంబై, అక్టోబర్ 29: మహారాష్ట్రలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు మరో భారీ డ్రగ్ రాకెట్‌ను ఛేదించారు. ఆదివారం ఛత్రపతి శంభాజీనగర్‌లోని ఒక ఫ్యాక్టరీపై దాడి చేసి ద్రవరూపంలో ఉన్న 160 కోట్ల రూపాయల విలువైన 107 లీటర్ల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అపెక్స్ మెడికెమ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో శనివారం జరిపిన తనిఖీల సందర్భంగా ఈ లిక్విడ్ మెఫెడ్రోన్ గురించి బయటపడినట్టు అధికారులు తెలిపారు. ఇటీవల సింథటిక్ డ్రగ్స్ వాడకం అధికం కావడం, కొందరు పరిశ్రమల పేరిట ఇలా అక్రమంగా డ్రగ్స్ తయారీ పెరగడంతో దాడులు నిర్వహిస్తున్నట్టు వారు చెప్పారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కళ్లల్లో పొడుచుకున్నట్టే

- కర్ణాటకలో 5 గంటలే కరెంట్
- సాక్షాత్తూ ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం చెప్పాక బస్సులేసుకొని కర్ణాటకకు పోవుడెందుకు?
- రైతుబంధు ఆపాలంటూ ఈసీకి లేఖ రాసిన కాంగ్రెస్‌ను బొందపెట్టండి
- నర్సాపూర్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్‌రావు



నర్సాపూర్‌లో ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

సిద్దిపేట, అక్టోబర్ 29 ( నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మన వేలితో మన కళ్లల్లో మనమే పొడుచుకున్నట్టేనని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. 'కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచింది.. కరెంట్ బంద్ అయింది.. పంటలు ఎండిపోతున్నాయి.. కర్ణాటక రైతులు రోడ్ల మీద పడ్డారు.. తప్పిపోయి ఇక్కడ కూడా కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్ల మూడు గంటల కరెంట్ వస్తది జాగ్రత్త అని మనం చెప్పాం. ఇప్పుడు వాళ్ల పార్టీకి చెందిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వచ్చి ఇదే విషయాన్ని కుండబద్దలు కొట్టారు' అని అన్నారు. తమ రాష్ట్రంలో ఐదు గంటల కరెంట్ మాత్రమే ఇస్తున్నామని డీకే శివకుమార్ చెప్పారని, వాస్తవానికి ఆ రాష్ట్రంలో వచ్చే కరెంట్ మూడు గంటలు మాత్రమేనని తెలిపారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో స్థానిక శాసనసభ్యుడు మదన్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డితో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో ఏం చేస్తున్నారో ఉన్నది ఉన్నట్టు చెప్పిన శివకుమార్‌కు ధన్యావాదాలు తెలుపుతున్నానని చెప్పారు. కర్ణాటక రాష్ట్రానికి రండ్రి బస్సు పెడతా అని శివకుమార్ సవాల్ విసిరారని, 'ఇంకేం చూస్తాం ఉన్నది ఉన్నట్టు మీరే చెప్పిండ్రు కదా.. ఇక చూసేదేముంది.. చెప్పేదేముంది' అని చురకలంటించారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ లేక, ఎరువులు దొరకక, నీళ్లు రాక పంటలు ఎండిపోయి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తుచేశారు. వ్యవసాయం దండుగ అనే పరిస్థితి తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీనేనని విమర్శించారు. ఇయ్యాళ సీఎం కేసీఆర్ 11సార్లు రైతుబంధు ఇచ్చి వ్యవసాయం పండుగ అయ్యేలా చేసి చూపించారని చెప్పారు.



నర్సాపూర్‌లో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

> కర్ణాటక మాడల్ ఫెయిల్యూర్.. తెలంగాణ మాడల్ కట్కవేస్తే వచ్చే కరెంట్. కర్ణాటక మాడల్.. కటిక చీకట్లోకి నెట్టేసే మాడల్. మనకు కర్ణాటక మాడల్ కావాలా? తెలంగాణ మాడల్ కావాలా? ప్రజలు ఆలోచన చేయాలి. ఐదు గంటలు కరెంట్ కావాలనే వాళ్లు కాంగ్రెస్‌కు ఓటేయండి.. 24 గంటల కరెంట్ కావాలన్న వాళ్లు కారు గుర్తుకు ఓటేయండి.
>
> -మంత్రి హరీశ్‌రావు

> ఎనకట హిందూ ధర్మంలో సత్యం శివం సుందరం అని ఒకమాట అందురు. శివుడు ఎప్పుడైనా నిజం పలుకుతాడని, శివుడు అబద్ధాన్ని నాశనం చేస్తాడని, ధర్మం వైపు నిలుస్తాడని దానర్థం. నిన్న కర్ణాటక శివుడు (డీకే శివకుమార్) వచ్చి సత్యం చెప్పిపోయిండు. తమ రాష్ట్రం కర్ణాటకలో రైతులకు 5 గంటల కరెంట్ మాత్రమే ఇస్తున్నామని, అంతకంటే ఎక్కువ ఇయ్యడం చేతనైతలేదు అని కుండబద్ధలుకొట్టిండు.
>
> - మంత్రి హరీశ్‌రావు

#### రైతుబంధు వద్దన్న కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలి

'కాంగ్రెస్ పార్టీ వాళ్లకు సిగ్గు లేదు. ఢిల్లీకి వెళ్లి యాసంగి పంటకు రైతుబంధు ఇవ్వద్దు అని ఎన్నికల కమిషన్‌కు ఉత్తరం ఇచ్చారు' అని హరీశ్‌రావు మండిపడ్డారు. రైతుబంధు వద్దన్న కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలని, ఆ పార్టీని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. పీసీసీ చీఫ్ రేవంత్ వ్యవసాయానికి 3 గంటలు, డీకే శివకుమార్ ఐదు గంటలు చాలు అని అంటున్నారని, మళ్లీ పాత రోజులు రావాలా? కర్ణాటక లెక్క ఐదు గంటలే కరెంట్ చాలా? మోటర్లు కాలిపోవాలా? అని ప్రశ్నించారు. మళ్లీ కేసీఆర్‌నే గెలిపించుకోవాలని, జీవితాలను ఇంకా బాగుచేసుకుందామని పిలుపునిచ్చారు.

#### రైతుబంధును సృష్టించింది కేసీఆరే

కేసీఆర్ సీఎం కాకముందు ఎవ్వరు కూడా రైతుల గురించి ఆలోచన చేయలేదని హరీశ్‌రావు పేర్కొన్నారు. కరెంట్‌బిల్లు, నీటి తీరువా, భూమిశిస్తు వసూలు చేసేవారని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ వచ్చాక నీటి తీరువా, కరెంట్ బిల్లు రద్దు చేసి, రైతుబంధు ఇచ్చారని పేర్కొన్నారు. 2016లో రైతుబంధు ఇస్తామని చెప్పిననాడు ఇదే కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఇది ఓట్ల ముందు వచ్చింది.. ఓట్ల ముందు పోతది అని విమర్శలు చేశారని మండిపడ్డారు. కేసీఆర్ మొదట్లో ఎకరానికి రూ. 8 వేలు ఇచ్చారని, తర్వాత రూ.10 వేలు చేశారని, ఇప్పుడు ఎకరానికి రూ. 16 వేలు ఇస్తామంటున్నారని చెప్పారు. కేసీఆర్ అంటే ఒక నమ్మకం.. విశ్వాసం అని పేర్కొన్నారు.

#### నర్సాపూర్ కార్యకర్తలు స్ఫూర్తినిచ్చారు

నర్సాపూర్ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు గొప్ప స్ఫూర్తిని చాటారని మంత్రి హరీశ్‌రావు అభినందించారు. 'నిన్న మొన్నటి వరకు మదన్‌రెడ్డి టికెట్టు కావాలని గట్టిగా అడిగారు. కొన్ని కారణాల వల్ల పార్టీ సునీతా లక్ష్మారెడ్డికి ఇచ్చింది. దీనిని పెద్ద మనస్సుతో స్వీకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ తల్లిలాంటిదని చెప్పి నిర్ణయానికి కట్టుబడి పని చేస్తామన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి ఇంత పెద్ద సంఖ్యలో తరలివచ్చిన వారందరికీ ధన్యావాదాలు' అని తెలిపారు. సునీతా లక్ష్మారెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని, అనంతరం మూడు నెలలకు వచ్చే ఎన్నికల్లో మదన్‌రెడ్డిని ఎంపీగా గెలిపించే బాధ్యతను సీఎం కేసీఆర్ తన మీద పెట్టారని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ వెంకట్రామ్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బాన్సువాడ.. ప్రగతి జాడ

**ప్రతి పల్లెకూ రవాణా సౌకర్యం**

- 11 వేల డబుల్ ఇండ్ల నిర్మాణం
- కార్పొరేట్ తరహా స్కూళ్లు, వైద్యం
- ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు
- రూ.10 వేల కోట్లతో అభివృద్ధి

ఉమ్మడి పాలనలో కంకరతేలి దుమ్ము కొట్టుకుపోయిన రోడ్లు.. సాగునీరు అందక బీళ్లుగా భూములు.. నాణ్యమైన విద్య.. వైద్యం అందని ద్రాక్షే.. ఇదీ నాటి బాన్సువాడ నియోజకవర్గ దుస్థితి.. గడిచిన తొమ్మిదేండ్ల కేసీఆర్ పాలనలో అభివృద్ధికి అడ్డగా మారింది బాన్సువాడ. రూ.10 వేల కోట్ల నిధులతో అన్ని రంగాల్లో ప్రగతి సాధించింది. పోచారం చొరవతో ప్రతి పల్లె రోడ్డు.. ప్రతి గుంటకు సాగునీరు.. ప్రతి ఇంటికీ పథకం.. ఇలా అభివృద్ధి, సంక్షేమంలో నియోజకవర్గం పరుగులు పెడుతున్నది.

బాన్సువాడ, అక్టోబర్ 29: బాన్సువాడ నియోజకవర్గం తొమ్మిదేండ్లలో అనూహ్య ప్రగతి సాధించింది. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా 11 వేల డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి పేదలకు పంచారు. రూ.650 కోట్ల నిధులతో పట్టణాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారు. యువతకు కోసం 2 కోట్లతో మినీస్టేడియాన్ని నిర్మించారు. కల్కి చెరువును 7 కోట్లతో మినీ ట్యాంక్ బండ్‌గా మార్చారు. మున్సిపాలిటీ కొత్త భవనాన్ని 2 కోట్లతో, రెవెన్యూ సముదాయాన్ని 1.50 కోట్లతో, సమీకృత మార్కెట్ దుకాణ సముదాయం 2 కోట్లతో, కల్కి చెరువు తీరాన 4 కోట్లతో ఆక్సిజన్ పార్కు, చిల్డ్రన్స్ పార్కును ఏర్పాటు చేశారు. బాన్సువాడలో 100 కోట్లతో ప్రభుత్వ దవాఖానలను ఆధునీకరించారు. కోటగిరిలోని పీహెచ్‌సీని స్పీకర్ పోచారం.. 13 కోట్లతో 50 పడకల దవాఖానగా అప్‌గ్రేడ్ చేశారు. చదువుకునేందుకు సౌకర్యాలు లేక వెనుకబడిన బాన్సువాడ.. నేడు ఎడ్యుకేషన్ హబ్‌గా మారింది. కాళేశ్వరం నుంచి గోదావరి జలాలను నిజాంసాగర్‌కు తరలించడంతో ఏడాదంతా ప్రాజెక్టు నిండుకుండలా కనిపిస్తున్నది. మంజీర పరీవాహక ప్రాంతాల్లో చెక్ డ్యాములు నిర్మించారు. కట్టల బలోపేతం, ప్రధాన కాలువ ఆధునీకరణ, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల మరమ్మతులతో ఆయకట్టు చివరిదాకా రెండు పంటలకూ నీరు అందుతున్నది. నియోజకవర్గంలోని మెట్ట భూములకు నీరందించేందుకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తలపెట్టిన చందూర్ ఎత్తిపోతల, సిద్దాపూర్ జలాశయం నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఇవి పూర్తయితే నాన్ కమాండ్ ఏరియా అంతా పచ్చటి పైర్లతో సస్యశ్యామలం అవుతుంది. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రోడ్డు వచ్చింది.




రుద్రూర్‌లోని ఆహార శాస్త్ర సాంకేతిక విజ్ఞాన కళాశాల

#### బాన్సుబాడ నియోజవర్గానికి నిధుల కేటాయింపు ఇలా..

| | |
|---|---|
| బాన్సువాడ పట్టణాభివృద్ధికి | రూ.650 కోట్లు |
| రైతుబంధు పథకం కింద | రూ.600 కోట్లు |
| ప్రతిపల్లెకు రోడ్డు కోసం | రూ.600 కోట్లు |
| గొర్రెల యూనిట్లు కోసం | రూ.300 కోట్లు |
| సిద్దాపూర్ జలాశయానికి | రూ.200 కోట్లు |
| చందూర్ ఎత్తి పోతల పథకానికి | రూ.150 కోట్లు |
| కాల్వల మరమ్మతుల కోసం | రూ.150 కోట్లు |
| కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు | రూ.110 కోట్లు |
| దవాఖానల ఆధునీకకరణకు | రూ.100 కోట్లు |
| పాఠశాలలు, కాలేజీల అభివృద్ధికి | రూ.100 కోట్లు |
| ఉచిత చేప పిల్లల పంపిణీకి | రూ.100 కోట్లు |
| రైతు బీమా కింద రైతులకిచ్చింది | రూ.70 కోట్లు |
| కేసీఆర్ కిట్ పథకం కింద | రూ.120 కోట్ల లబ్ధి |

11 వేల కుటుంబాలకు డబుల్‌బెడ్రూం ఇండ్లు

# జుక్కల్.. ప్రగతి పరుగుల్

> జుక్కల్.. ఒకనాడు ఈ ఊరు తెలంగాణలో ఉందన్న విషయం ఎవరికీ తెల్వదు. నీళ్లు లేవు, రోడ్లు లేవు, యువతకు ఉపాధి లేదు, మొత్తంగా ఇక్కడి ప్రజలకు అభివృద్ధి అంటేనే తెల్వదు. ఏ నాయకుడూ పట్టించుకోలే.. ఏ ప్రభుత్వమూ కన్నెత్తి చూడలే. తెలంగాణ వచ్చినంకనే అభివృద్ధి అంటే ఏమిటో పరిచయం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం. ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందించింది. యువతకు ఉపాధి కల్పించింది. తొమ్మిదేండ్లలోనే అభివృద్ధి అంటే ఏమిటో కండ్ల ముందు ఉంచింది.

- సరిహద్దు నియోజకవర్గానికి నిధులు
- బిచ్కుందలో 100 పడకల దవాఖాన
- 'నాగమడుగు'తో సస్యశ్యామలం
- 120 గ్రామాలకు అద్దంలా రోడ్లు



బిచ్కుందలో ప్రస్తుతం ఉన్న 30 పడకల దవాఖాన

నిజామాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/నిజాంసాగర్: తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులో ఉండే జుక్కల్ నియోజకవర్గం తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి పథాన సాగుతున్నది. ఉమ్మడి పాలనలో తలాపునే నిజాంసాగర్ ఉన్నా సాగు, తాగునీటికి అల్లాడిన ప్రాంతం నేడు కాళేశ్వర జలాలతో పాడిపంటలతో పచ్చగా మారింది. ఏకంగా నాలుగుసార్లు కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన సౌదాగార్ గంగారాం.. ఎన్నడూ నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోలే. నిధులూ తీసుకురాలే. కనీసం గ్రామాలకు రోడ్ల సౌకర్యాన్ని కల్పించలే. తెలంగాణ వచ్చినంక ఎమ్మెల్యే హన్మంత్ షిండే అభివృద్ధి పనులు చేపట్టారు. బిచ్కుందలో 100 పడకల దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా ఉన్న ఈ దవాఖానను అంచెలంచెలుగా ఉన్నతీకరించారు. ప్రస్తుతం 30 పడకల ఈ దవాఖాన అద్భుతంగా వైద్యసేవలను అందిస్తున్నది. పిట్లం, బిచ్కుందలో వంద పడకల దవాఖానలు, బిచ్కుందలో డయాలసిస్ కేంద్రంతోపాటు విరివిగా పల్లె దవాఖానల ఏర్పాటుతో నాణ్యమైన వైద్యం ప్రజలకు చేరువైంది.ఎప్పుడూ ఎండి కనిపించే నిజాంసాగర్ ప్రాజెక్టు స్వరాష్ట్రంలో కాళేశ్వరం జలాలతో నిండుకుండలా మారింది. నిజాంసాగర్ ఆయకట్టు కింద రెండు పంటలు పండుతున్నాయి. మరో 40 వేల ఎకరాలకు సాగు నీరు అందించేలా నిజాంసాగర్ మండలంలో మంజీరా పరీవాహక ప్రాంతంలో 436 కోట్లతో నాగమడుగు మత్తడిని నిర్మిస్తున్నారు. ఈ పనులు పూర్తయితే నిజాంసాగర్, పిట్లం, పెద్ద కొడప్‌గల్, బిచ్కుంద, మండలాల్లోని నాన్‌కమాండ్ ఏరియాకు సాగునీటి ఇబ్బందులు ఉండవు. 120 గ్రామాలకు బీటీ రోడ్లు పడ్డాయి. నిజాంసాగర్ మండలంలో 1,298 దళిత కుటుంబాలకు 10 లక్షల చొప్పున అందజేశారు. రెండోవిడతలో మరో 277 కుటుంబాలకు దళిత బంధు సాయం అందించారు. బిచ్కుందలో డిగ్రీ కళాశాలతోపాటు ప్రతి మండలంలో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయించారు. గురుకుల, ఆదర్శ పాఠశాలలు, కస్తుర్బా పాఠశాలలకు నూతన భవనాలు నిర్మించారు. మన ఊరు మన బడి పథకం కింద పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించారు. ఫలితంగా నియోజకవర్గంలో విద్యావ్యవస్థలో చాలా మార్పులు వచ్చాయి.



నారాయణఖేడ్‌లో రూ.13 కోట్లతో అద్భుతంగా నిర్మించిన సాంఘిక సంక్షేమ గురుకుల భవనం

# నారాయణఖేడ్.. అభివృద్ధి దౌడ్

**పదేండ్లలో అన్నిరంగాల్లో అభివృద్ధి**

- మెరుగైన విద్య, వైద్య సదుపాయాలు
- సంగమేశ్వర ఎత్తిపోతలతో సస్యశ్యామలం
- రెవెన్యూ డివిజన్, కొత్త మండలాల ఏర్పాటుతో ప్రజలకు చేరువైన పాలన

> నారాయణఖేడ్ అంటేనే రాళ్లు, రప్పలు, గుట్టలు.. మెట్ట ప్రాంతాలు.. కరువుకు కేరాఫ్.. వలసలకు నెలవు.. భూములను అమ్ముదామన్నా కొనే దిక్కులేని దుస్థితి.. ఉమ్మడి పాలకులె వరూ పట్టించుకోలేదు. కనీస వసతులు కానరాలేదు.. కానీ, స్వరాష్ట్ర పాలనలో నారాయణఖేడ్ అభివృద్ధిలో దౌడ్ అందుకున్నది. మిషన్ భగీరథతో ఇంటింటికీ తాగునీరు.. కాళేశ్వర జలాలతో సాగునీరు అందుతున్నది. ఇప్పుడు అక్కడ వలసలు లేవు. స్థానికంగానే చేతినిండా పనిదొరుకుతున్నది. తొమ్మిదేండ్లలో అన్నిరంగాల్లో అభివృద్ధి కండ్లముందు కనిపిస్తున్నది.

సంగారెడ్డి, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి పాలనలో కరువుతో అల్లాడిన నారాయణఖేడ్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దౌడు తీస్తున్నది. రూ.289 కోట్లకు పైగా వ్యయంతో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నారు. రూ.456 కోట్లతో పంచాయతీరాజ్‌శాఖ ద్వారా గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, రైతు వేదికలు, వైకుంఠధామాలు నిర్మించారు. రూ.110 కోట్లతో తండాలన్నింటికీ బీటీ రోడ్లు వేశారు. రూ.30 కోట్లతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించారు. రూ.51 కోట్లతో 26 హైలెవల్ వంతెనలు నిర్మించారు. రూ.10 కోట్లతో 84 పంచాయతీల్లో భవనాలు. నారాయణఖేడ్‌లో రూ.50 కోట్లతో 1,100 డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కట్టారు. రూ.25 కోట్లతో నారాయణఖేడ్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.26 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో సీసీ రోడ్లు, మురుగుకాల్వలు నిర్మించారు. రూ.50 కోట్లతో నారాయణఖేడ్‌లో మౌలిక వసతుల కల్పించారు. 17 సబ్‌స్టేషన్లను నిర్మించారు. రూ.4.60 కోట్లతో యూత్ సెంటర్ భవనం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

#### బసవేశ్వర ఎత్తిపోతలతో నారాయణఖేడ్ సస్యశ్యామలం

కాళేశ్వరం, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలతో నారాయణఖేడ్ సస్యశ్యామలం కానున్నది. ఈ ఏడాది మార్చిలో మంత్రి హరీశ్‌రావు బోరంచలో బసవేశ్వర ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించారు. రూ.1,774 కోట్లతో నిర్మించే ఈ పథకం ద్వారా నియోజకవర్గంలోని 166 గ్రామాల్లో ఉన్న 1.31 లక్షల ఎకరాలకు సాగునీరు అందనున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు 19, 19 ఏ ప్యాకేజీ పనులు రూ.800 కోట్లతో జరుగుతున్నాయి. కాళేశ్వరం కాల్వల ద్వారా నియోజకవర్గంలోని 30 వేల ఎకరాలకు సాగునీరు అందనున్నది. నల్లవాగు ప్రాజెక్టును రూ.25 కోట్లతో ఆధునీకరించారు. మిషన్ కాకతీయ ద్వారా రూ.98 కోట్లతో 289 చెరువులను అభివృద్ధి చేశారు. రూ.5.28 కోట్లతో మూడు చెక్‌డ్యామ్‌లు నిర్మించారు. నారాయణఖేడ్‌లో రూ.6 కోట్లతో వంద పడకల దవాఖానగా మార్చారు. రూ.11 కోట్లతో 50 పడకల మాతాశిశు దవాఖానను, రూ.1.10 కోట్లతో డయాలసిస్ సెంటర్‌ను, రూ.2.5 కోట్లతో మినీ టీ డయాగ్నస్టిక్ హబ్‌ను, రూ.1.03 కోట్లతో ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కరస్‌గుత్తి, కల్హేర్‌లో రూ.11 కోట్లతో 30 పడకల దవాఖానలను ప్రభుత్వం నిర్మించింది. రూ.3.12 కోట్లతో నిజాంపేట, సిర్గాపూర్‌లో పీహెచ్‌సీలను ఏర్పాటు చేసింది. ఎనిమిది గురుకులాలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. రూ.22 కోట్లతో నారాయణఖేడ్‌లో నాలుగు గిరిజన గురుకుల భవనాలను నిర్మించారు. మన ఊరు-మనబడి కింద రూ.34 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. నారాయణఖేడ్ రెవెన్యూ డివిజన్‌గా, కొత్తగా సిర్గాపూర్, నాగల్‌గిద్ద, నిజాంపేట, తడ్కల్ మండలాలను ఏర్పాటుచేసి పాలనను ప్రజలకు మరింత చేరువ చేశారు. వంద తండాలను పంచాయతీలుగా మార్చారు.